బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్



చంద్రమోహన్‌గౌడ్

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఉదారి చంద్రమోహన్‌గౌడ్ ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌళిలో హైకోర్టు జస్టిస్ పి. నవీన్ రావు రిటర్నింగ్ అధికారిగా వ్య వహరించగా రాష్ట్రంలో ఉన్న ఉమ్మడి పది జిల్లాల నుంచి 20 మంది ఓటర్లు పాల్గొనగా 20/20 ఓట్ల మెజార్టీతో రా ష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆయన ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ సెక్రటరీగా సుకుమార్ ఫ్రాన్సిస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రా నున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో బాస్కెట్ బాల్ గేమ్ అభివృద్ధికి దోహదపడుతాయని అన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ



మాజీ ఎమ్మెల్యే ఓదెలును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలును మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. తొందరలోనే కొలుకుంటారని, అధైర్యపడవద్దని ఓదెలుకు ఎమ్మెల్యే వివేక్ మనోధైర్యం కల్పించారు.

ఆగని నకిలీ పత్తి విత్తనాల దందా..!



- మంచిర్యాల కేంద్రంగా రూ. కోట్ల వ్యాపారం
- వివిధ రాష్ట్రాల నుంచి జిల్లాకు దిగుమతి
- అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ నజర్



మందమర్రిలో ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు (ఫైల్)

మంచిర్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పత్తి సీజన్ సమీపిస్తున్న తరుణంలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా ఆందోళనకు దారి తీస్తోంది. అమాయకపు రైతులే లక్ష్యంగా స్మగ్లర్లు పెద్ద మొత్తంలో నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంగా రూ. కోట్లు విలువ చేసే నకిలీ దందా జోరుగా సాగుతోంది. పోలీసుల కళ్లు గప్పి వివిధ రాష్ట్రాల నుంచి స్మగ్లర్లు గుట్టు చప్పుడు కాకుండా పెద్ద మొత్తంలో నకిలీ సరుకును జిల్లాకు తరలిస్తున్నారు. విడి విత్తనాలు, బట్ట సంచుల్లో ప్యాక్ చేసిన నకిలీ విత్తనాలను నేరుగా రైతులకు అంటగడుతున్నారు. కొందరు అక్రమార్కులు ముఠాగా ఏర్పడి రవాణా చేస్తున్నారు. జిల్లాలోని కొందరు డీలర్లతో సత్సంబంధాలు నెరుపుతున్న సదరు ముఠా సభ్యులు తక్కువ ధరకు వారికి సరఫరా చేస్తున్నారు. లైసెన్స్‌డ్ డీలర్ల కంటే బయటి వ్యక్తుల వద్ద విత్తనాలు చవకగా లభిస్తుండటంతో రైతులు వాటిని కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. నాణ్యమైన విత్తనాలతో చేసే సాగుతో పోల్చితే నకిలీ విత్తనాలతో చేసే సాగుకు పెట్టుబడిలో భారీగా వ్యత్యాసాలు ఉండటంతో రైతులు వాటిపై వైపే మొగ్గు చూపుతున్నారు. నకిలీ విత్తనాల సరఫరాను నియంత్రించేందుకు పోలీసులు దాడులు చేస్తున్నా అక్రమ దందా కొనసాగుతుండటం గమనార్హం. నకిలీ విత్తనాల దుష్ప్రభావం, వాటి వల్ల కలిగే నష్టాలపై వ్యవసాయ, పోలీసులు శాఖలు సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నా ఆశించిన ఫలితం ఉండటం లేదు.

నకిలీ విత్తనాలతో దుష్ప్రభావం...

పోలీసుల దాడుల్లో అధికంగా పట్టుబడుతున్న వాటిలో నిషేధిత (బీటీ-3) విత్తనాలతోపాటు హెచ్‌టీ కాటన్ (హెర్బిసైడ్ టాలరెన్స్) అధికంగా ఉంటున్నాయి. ఇవి జన్యు మార్పిడి చేసిన పత్తి విత్తనాలుగా వ్యవసాయ అధికారులు, పోలీసులు పేర్కొంటు న్నారు. ఈ విత్తనాలు గ్లైఫోసెట్ అనే కలుపు మందును తట్టుకుంటాయి. ఈ కలుపు మందు పత్తి పంటను కాకుండా మిగతా అన్ని కలుపు మొక్కలను నాశనం చేస్తుంది. అయితే గ్లైఫోసెట్ మందు క్యాన్సర్ కారకమని రుజువు కావడంతోపాటు పర్యావరణానికి కూడా హాని కలిగిస్తున్నందున ప్రభుత్వం దాన్ని నిశేధించింది. హెచ్‌టీ కాటన్‌తో పర్యావరణంతో పాటు ప్రాణులపై పడే ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ చవకగా లభిస్తున్నందున రైతులు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా నిషేధిత విత్తనాల కారణంగా భూసారం దెబ్బతినే ప్రమాదం ఉంది. భూములను కౌలుకు తీసుకుని సాగు చేసే వారికి భూమి జీవితకాలంతో సంబంధం లేకుండా అధిక దిగుబడే లక్ష్యంగా ఉంటుంది. ఈ కారణంగా కైలు రైతులు నిషేధిత విత్తనాల వైపు అధికంగా మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.

నిత్యావసరాలు తరలించే వాహనాల్లో...

జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతోంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి ఈ నకిలీ విత్తనాలు జిల్లాకు చేరుకుంటున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూలు, ప్రకాశం, నంద్యాల నుంచి పెద్ద మొత్తంలో సరఫరా అవుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలను తయారుచేసి, అక్కడి నుంచి అక్రమంగా జిల్లాలోని రైతులకు విక్రయిస్తున్నారు. స్మగ్లర్లు నకిలీ విత్తనాలను ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు నిత్యావసర వస్తువులు తరలించే వాహనాల్లో రహస్యంగా తరలిస్తున్నారు. ఆంధ్రకు చెందిన కొందరు పత్తిసాగు పేరుతో జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి, జైపూర్, తదితర ప్రాంతాలలో నివాసం ఉంటారు. ఇక్కడి భూములను కౌలుకు తీసుకొని నామమాత్రంగా వ్యవసాయం చేస్తూ ఇక్కడి విత్తన డీలర్లు, రైతులతో పరిచయాలు పెంచుకుంటారు. వారికి అనుకూలంగా ఉన్న వారితో ముఠాలను ఏర్పాటు చేసుకొని నకిలీ పత్తి విత్తనాలను రవాణా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ పోలీసులు జరిపిన దాడుల్లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు వ్యక్తులు పట్టుబడట మే దీనికి నిదర్శనం.

విత్తన భారంతో....

పత్తి రైతులపై విత్తన భారం ఏటా పెరుగుతూనే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నయా పైసా సబ్సిడీ లేకపోవడం, ప్రైవేటు విత్తన కంపెనీలు, డీలర్ల నుంచి కొనుగోలు చేయాల్సి రావడం రైతులకు శాపంగా మారుతోంది. తాజాగా కేంద్ర వ్యవసాయ శాఖ పత్తి విత్తనాల ధరలు పెంచుతూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా బీజీ-2 475 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్ ధరను రూ. 901గా నిర్ణయించింది. గత ఏడాది అదే ప్యాకెట్ ధర రూ. 864 ఉండగా, ఈ ఏడాది రూ. 37 అదనంగా పెంచింది. గడిచిన గడిచిన ఐదేళ్లలో ఏకంగా రూ. 134 పెరిగింది. జిల్లాలో..

(తరువాయి 7లో)

రాజీవ్ యువ వికాసంపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



ఎంపీడీవోకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రాజీవ్ యువవికాస పథకంలో ఆన్‌లైన్‌చేసిన దరఖాస్తులు పరిశీలించి ఎవరైనా ఆఫ్‌లైన్ దరఖాస్తులు సమర్పిస్తే అట్టి వాటిని హెల్ప్‌డెస్క్ ద్వారా ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల వారీగా వేరు వేరుచేసి తదుపరి కార్యచరణకు సిద్ధంగా ఉంచాలన్నారు.

సన్నబియ్యం పథకం మోదీ ప్రభుత్వానిది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న సన్నబియ్యం పథకం రాష్ట్ర ప్రభుత్వానిది కాదని ఈ పథకానికి సంవత్సరానికి రాష్ట్రంలో పది వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వానిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం చెన్నూరులో ఆయన మాట్లాడుతూ కరోనా సమయం నుంచి ప్రతి వ్యక్తికి ఐదు కిలోల బియ్యం నరేంద్రమోదీ ప్రభుత్వం ఉచితంగా అందజే స్తోందన్నారు. బియ్యం పంపిణీ కార్యక్రమం వడ్ల సేకరస్త్రణతో ప్రారంభమవుతుందని, వడ్ల సేకరణలో గోనె సంచులు సుతిలి తాళ్లు ట్రాన్స్‌పోర్టేషన్ హమాలీలకు మొత్తం కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తామే పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ ప్రచారం చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసినంత మాత్రాన ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేసేది బీజేపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

రైతుల కోసం పోరాటం చేస్తాం

దండేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నుముక్క రైతన్న ప్రపంచానికి ఆకలి తీరుస్తున్న రైతన్న జీవితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడ లాగానే ఉందని, రైతుల కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఉద్యమ పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక సత్యనారాయణరెడ్డి అన్నారు. దండేపల్లిలో మంగళవారం నూతన సంఘాన్ని ఏర్పాటు చేసి జెండాను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా, సన్నవడ్లకు మద్దతు ధర వెంటనే చెల్లించి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలో చెత్తచెదారంతో నిండిపోయి చివరి పంటలకు సాగునీరు అందడం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించిన పంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవా లన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ్ నాయకులు గోళ్ల తిరుపతి, చీర్ల వెంకటేశ్వర్లు, బొమ్మెన మహేష్ కారుకూరి తిరుపతి, రాకేష్, రవీందర్ పాల్గొన్నారు.

డంప్ యార్డును తరలించండి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయ సమీపంలో ఉన్న డంప్ యార్డును అక్కడినుంచి తరలించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా కోరారు. ఈ మేరకు ఆయన జీఎం ఎం. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. డంప్ యార్డుతో దుర్వాసన, పొగ తీవ్రంగా వస్తోందని, దీనివల్ల ఆర్‌కే 5 కాలనీ, బంగ్లాస్ ఏరియా, సింగాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ, తదితర ప్రాంతాల వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిషన్ రావు, బుచ్చయ్య, రాంచందర్, అఫ్రోజ్‌ఖాన్, లక్ష్మణ్, సదానందం, నర్సింగారావు, సందీప్, నవీన్ రెడ్డి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల వాసికి గ్రూప్-1లో 161వ ర్యాంకు



స్వీటు తినిపిస్తున్న తల్లి, సోదరులు

జన్నారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొనకల్ గాంధీ నగర్‌కు చెందిన హరిదాసు-భాగ్యలక్ష్మీల మూడవ కుమారుడు అనిల్‌కుమార్ గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో 161వ ర్యాంకు సాధించాడు. పది సం వత్సరాల క్రితం అనిల్‌కుమార్ తండ్రి మృతిచెందడంతో తల్లి కష్టపడి చదివించింది. గతేడాది గ్రూప్-4లో మంచిర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్శిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అటు ఉద్యోగం చేస్తూనే గ్రూప్-1కు సన్నద్ధమై సత్తాచాటాడు. దీంతో తల్లి భాగ్యలక్ష్మి, అన్నయ్యలు అరుణ్‌కుమార్, అజయ్‌కుమార్ ఆనందంలో మునిగి తేలుతున్నారు. స్థానికులు, మిత్రులు అనిల్‌కుమార్‌ను అభినందించారు.

గౌతమేశ్వర కాలనీ అధ్యక్షుడిగా లక్కాల శ్రీనివాస్



మంచిర్యాలక్రైం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులోని గౌతమేశ్వర కాలనీ నూతన అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు లక్కాల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం కాలనీకి నూతన కమిటీని ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శిగా ఉస్కమల్ల చందు, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా స్వామి, వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడిగా కార్తీక్ శర్మ, సలహాదారుడిగా సమ్మిరెడ్డి, ధర్మయ్య, రామన్న పటేల్, సభ్యులుగా సురేందర్, సంతోష్‌గౌడ్, శంకర్, రమేశ్, తిరుపతి, రామక్రిష్ణలు ఎన్నికయ్యారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందాం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందామని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.నర్సింగ్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్‌సీ వర్గీకరణ పేరుతో దళితులను వర్గీకరించి ఐక్యతను దెబ్బతీయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించే ప్రయత్నం చేస్తోందన్నారు. దీనివల్ల మాలలు, మాల ఉప కులాలకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ముందుగా వర్గీకరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కేవలం ఓట్ల రాజకీయమేనని మాదిగలు గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురికి నియామకపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తలారి రాజు, బింగి సదానందం, పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే పథకం

- డీసీసీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ
- లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ



సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చరిత్రలో నిలిచి పోతుందని డీసీసీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. పాత మంచిర్యాల 8వ వార్డులో సన్న బియ్యం పథకాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం ఇంటింటికి సన్న బియ్యం పథకాన్ని ముఖ్య మంత్రి ప్రారంభించారన్నారు. పేద వారికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. గత ప్రభుత్వాలు పంచిన దొడ్డు బియ్యాన్ని తినలేక అమ్ముకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. పాత మంచిర్యాలకు ఆరులైన్ల రహదారులను ఏర్పాటు చేస్తున్నారని, ముల్కల్ల నుంచి అంతర్గాం వరకు గోదావరిపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడతామన్నారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు భానేష్, పూదరి తిరుపతి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మహిళ నాయకురాళ్లు హేమలత

అర్హులందరికీ సన్న బియ్యం

కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్‌లో రేషన్ బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్ : ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పథకం ద్వారా ప్రతి ఒక్క లబ్దిదారుడికి సన్న బియ్యం అందిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ అంబేద్కర్ కాలనీ, అల్లూరి సీతారామ రాజు నగర్‌లో మంగళవారం రేషన్ షాపుల వద్ద సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి బ్రహ్మారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు కడుపు నిండా అన్నం పెట్టాలన్నా లక్ష్యంతో సన్న బియ్యం పథకాన్ని అమలు చేసిందన్నారు. సన్నబియ్యం పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. అధికార యంత్రాంగం సమన్వయంతో అబ్దిదారులందరికి సన్న బియ్యం చేరే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో చౌకధరల దుకాణాల నిర్వహకులు, సంబందిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్: ప్రభుత్వం పంపిణీ చేసే సన్న బియ్యాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు హేమలత, మినాజ్, రేషన్ డీలర్లు అన్నారు. మంగళవారం సన్నబియ్యం పథకాన్ని జిల్లా కేంద్రాల్లోని పలు రేషన్ షాపుల్లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ ధర్మేందర్, నాయకులు సత్తార్, చారి, రాజేందర్, పాల్గొన్నారు.



అడుగంటుతున్న పీపీరావు ప్రాజెక్టు

6

- అస్తవ్యస్తంగా కాలువలు
- చివరి దశలో వరి పంట
- ఆందోళనలో అన్నదాతలు

వసతులు లేని.. వార సంత

7

- రోడ్డుపైనే విక్రయాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

విద్యార్థి సంఘాల నేతల ముందస్తు అరెస్టులు



నస్పూర్ పోలీస్ స్టేషన్ వద్ద నాయకులు

నస్పూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోలీసులు విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం నస్పూర్ మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, ఎస్ఎఫ్ఐ నాయకుడు సత్యనారాయణలను అరెస్టు చేశారు. తమ నిరసనను తెలియజేయడానికి వీలులేకుండా ముందస్తుగా అరెస్టు చేసారని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

కాసిపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తూ ఉద్యమాన్ని ఆపాలని అనుకోవడం అవివేకమని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీయూ భూములను కాపాడడం కోసం చలో యూనివర్శిటీకి ఇచ్చిన పిలుపు నేపథ్యంలో పోలీసులు సీపీఎం నాయకులతో పాటు ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు.

హైద్రాబాద్ సిటీ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కార్పో రేట్ సంస్థలకు అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. రేవంత్ సర్కార్ రియల్ ఎస్టేట్ మాఫియా కనుసన్నల్లో నడుస్తుందన్నారు. అక్రమ అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు.

తాండూర్ : హెచ్‌సీయూ భూములను కాపాడడం కోసం చలో యూనివర్శిటీకి పిలుపునిచ్చిన నేపథ్యంలోతాండూర్ మండల సీపీఎం, రైతు సంఘం నాయకులను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ మాట్లాడుతూ హైద్రాబాద్ సిటీ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. అరెస్టు అయిన వారిలో నాయకులు మలిశెట్టి సత్యనారాయణ, ఎడ్ల గోపాల్, పట్టి శంకర్, పాల్గొన్నారు.

యువత బెట్టింగులకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్‌లు, నిషేధిత ప్లే కార్డ్స్ గేమింగ్ యాప్‌లకు, ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సులభంగా ఎక్కువ డబ్బులు సంపాధించవచ్చని భ్రమలో యుత, ప్రజలు విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌లకు బానిసలుగా మారి అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ప్లే కార్డ్స్ గేమ్స్ కట్టడికి జిల్లా పోలీసు శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందన్నారు. అలాగే ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ వల్ల యువత ఆర్థికంగా దెబ్బతిని చివరికి సూసైడ్ చేసుకొని ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని చెప్పారు. ఇంట్లో తల్లితండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టాలన్నారు. బెట్టింగ్ యాప్‌ల డౌన్‌లోడ్ ద్వారా ప్రజల వ్యక్తిగత సమాచారం, అకౌంట్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లే అవకాశం ఉందన్నారు. యువత బెట్టింగ్ సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని కోరారు.

వేర్వేరు చోట్ల అనుమానాస్పదస్థితిలో ఇద్దరి మృతి

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో మంగళవారం వేర్వేరు చోట్ల అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మంచిర్యాల పట్టణం రాళ్లపేట్ రోడ్డుకు చెందిన ప్రభుదాస్ (50) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ వినీత తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ప్రభుదాసు తెలంగాణ హోటల్ యజమాని. సోమవారం మద్యం సేవించాడు. ఎందుకు తాగుతున్నావని భార్య మందలించింది. రాత్రి గొడవ పడి ప్రభుదాసు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మళ్లీ ఇంటికి రాకపోవడంతో తన అక్క ఇంటికి వెళ్లాడని అనుకున్నది. తెల్లవారు జామున హోటల్ వర్కర్ హోటల్ పక్క గల్లిలో మృతి చెంది ఉన్నాడని ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ప్రభుదాస్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ప్రభుదాసు ఆరోగ్యం క్షీణించిందని గుండెపోటుతో మరణించాడా మరేదైనా కారణమా అని అనుమానం వ్యక్తం చేయడంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీశ్రీనగర్‌కు చెందిన మహిళ

మంచిర్యాల పట్టణం శ్రీశ్రీనగర్‌కు చెందిన వజ్రమ్మ(45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్ఐ సత్తయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల వజ్రమ్మ 20 సంవత్సరాలుగా భర్తను వదిలి ఒంటరిగా ఉంటోంది. కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తోంది. ఈ నెల 29న కనిపించిన వజ్రమ్మ రెండు రోజుల నుంచి పక్కవారికి కనిపించలేదు. బుధవారం ఉదయం వజ్రమ్మ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో కిటికి నుంచి చూడగా ఆమె మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ఆమె గుండెపోటుతో మరణించి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తల్లి దుర్గం మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

స్టీల్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామన్‌కాలనీ రాజన్నల వాడ వద్ద ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన స్టీల్‌ను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. డ్రైనేజీ పనుల నిమిత్తం కాంట్రాక్టర్ ఇసుక, సిమెంటు, కంకరతో పాటు స్టీల్‌ను ఉంచగా 6 క్వింటాళ్ల స్టీల్‌ను ఎత్తుకెళ్లిపోయారు. ఈ విషయంపై కాంట్రాక్టర్ స్థానికులకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనాల వల్ల పనులకు ఆటంకం కలుగుతుందని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల్లో స్టీల్‌ను ఎత్తుకెళ్లినట్లు రికార్డు అయ్యిందన్నారు. నిందితులను పట్టుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం ఖమాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నితీష్ అనే యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలిగి బీపీఎంగా పని చేస్తున్న నితీష్ వ్యక్తిగత పనుల నిమిత్తం వాంకిడి మండల కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఓ వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీ కొన్నాడు. అతడి కాలుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కాగజ్‌నగర్‌కు తరలించారు.



నీటి మట్టం తగ్గిన పీపీరావు ప్రాజెక్టు

అడుగంటుతున్న పీపీరావు ప్రాజెక్టు

- అస్తవ్యస్తంగా కాలువలు
- చివరి దశలో వరి
- ఆందోళనలో అన్నదాతలు

దహెగాం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని పాల్వాయి పురుషోత్తమరావు ప్రాజెక్టులో నీరు అడుగంటి పోతోంది. దీంతో ఈ ప్రాజెక్టు కింద వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు ప్రధాన కాలువలో పిచ్చి మొక్కలు, పూడిక మట్టి నిండింది. తూములు శిథిలావస్థకు చేరుకున్నాయి. పిల్ల కాలువలు అస్తవ్యస్తమై పొలాలకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రాజెక్టు కింద ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పొలాలకు సాగు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు.

కల్వాడ గ్రామ శివారులో..

దహెగాం మండలం కల్వాడ గ్రామ శివారులో జూన్ 6, 2000 సంవత్సరంలో అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయకుడు పీపీరావు ప్రాజెక్టు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నవంబరు 2003లో సాగునీటిని విడుదల చేశారు. రూ.37 కోట్లతో ఎర్రవాగు, నల్లవాగులపై ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 2003లో సాగునీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 0.85టీఎంసీలుగా అధికారులు చెబుతున్నారు. దహెగాం మండలంలోని కల్వాడ, కుంచవెల్లి, చంద్రపల్లి, పీకలగుండం, బాహానగర్, బ్రాహ్మణ్‌చి చ్వాల, లగ్గాం, బోగాం, ఒడ్డుగూడ, తదితర గ్రామాల్లోని 9 వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం చింతలపుడి, మెట్‌పల్లి, తదితర గ్రామాల్లో రెండు వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం యాసంగిలో దహెగాం మండలం కల్వాడ, కుంచవెల్లి, చంద్రపల్లి, పీకలగుండం గ్రామాల్లో 1,500 ఎకరాలకు మాత్రమే సాగునీరు వస్తుందని రైతులు చెబుతున్నారు.

ప్రధాన కాలువల్లో పూడిక..

ప్రధాన కాలువల్లో పూడిక నిండి పిచ్చి మొక్కలు పెరిగి సాగునీరు పొలాలకు అందడం లేదు. కుంచవెల్లి సమీపంలోని ప్రధాన కాలువ వద్ద నిర్మించిన పైపులైన్ కల్వర్టు కింద కుంగి పోయి మట్టి నిండి పోయింది. దీంతో కుంచవెల్లి, చంద్రపల్లి, పీకలగుండం గ్రామాల రైతులు సాగు చేసిన వరి పొలాలకు సాగు నీరు అందడం లేదు. జేసీబీ సహయంతో గట్టును తవ్వి కాలువలో పైపును ఏర్పాటు చేసి తమ పొలాలకు సాగునీరు అందిస్తున్నారని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. ప్రధాన కాలువలో పిచ్చి మొక్కలు, పూడిక మట్టి నిండి ఉండడంతో కొంత నీరు ఎర్రవాగులోకి వృథాగా పోతున్నది.

పొట్ట దశలో..

ప్రాజెక్టు సాగు చేసిన వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది మరో నెల రోజులు నీరందితే తప్ప పంట చేతికందే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతానికి ప్రాజెక్టులో సాగునీరు పూర్తిగా అడుగంటి పోయింది. చివరి తడులకు సాగునీరు అందుతుందా లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం చేరింది. అధికారులు నీటి వినియోగంపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోడం వల్లే పంటకు నీరు అందని పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. కనీసం ప్రధాన ఎడమ కాలువలోని పిచ్చి మొక్కలను, పూడిక తీత పనులు ఉపాధిహామీ పథకం కింద చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పొలాలకు నీరు రావడం లేదు..

గోర్కల తిరుపతి, రైతు, చంద్రపల్లి



సాగునీరు పొలాలకు సక్రమంగా రావడం లేదు. పది మంది రైతులు ప్రదాన కాలువలో జేసీబీతో కాలువ గట్టు తవ్వి పైపులు ఏర్పాటు చేసి నీటిని వారి పొలాలకు పారించుకుంటున్నారు. అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్న ప్రస్తుతం పొట్టదశలో ఉంది.

తూములకు గేట్లు లేవు..

దుర్గం కేదారి, రైతు, పీకలగుండం



ప్రధాన ఎడమ కాలువ తూములకు గేట్లు లేవు. దీంతో చంద్రపల్లి సమీపంలో నీరు వృధాగా పోయి ఎర్రవాగులో కలుస్తుంది. నీటికి అడ్డుకట్ట వేస్తే రైతు లకు ఉపయోగపడే అవకాశం ఉంది. అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. ఉపాధి హామీ పనుల్లో భాగంగా అయినా కాలువల మరమ్మతులు చేపట్టాలి.



ఎడమ కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు

ఉపాధి హామీ కూలీలకు నిబంధనల మేరకు పనులు

షాకీర్ ఉస్మాని, ఏపీవో



ఆంధ్రజ్యోతి: మండలంలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఏపీవో: మండలంలోఉపాధిహామీ కూలీలకు నిబంధనల మేరకు పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మండల పరిధిలో 12 వేల మంది జాబ్‌కా ర్డుదారులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఎన్ని మొక్కలు పెంచుతున్నారు?

ఏపీవో: మండలంలో 29 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతి నర్సరీలో 12 వేల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ పథకం కింద 2025-26 సంవత్సరంలో ఎలాంటి పనులు చేట్టనున్నారు?

ఏపీవో: మండల పరిధిలో 2025-26 సంవత్సరంలో రాళ్ల కట్టలు, కుంటలు, పారం పాండు, లింకు రోడ్లు తదితర పనులు చేపట్టాలని నిర్ణయించాం. ఈ మేరకు సిబ్బందిని సమన్వయ పరిచి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో కమ్యూనిటీ టాయిలెట్‌లు ఎంత వ్యయంతో నిర్మిస్తున్నారు?

ఏపీవో: మండల కేంద్రంలో కమ్యూనిటీ టాయిలెట్‌ను రూ.2 లక్షలతో నిర్మాణం ప్రారంభించాం. అందులో గ్రామ పంచాయతీ నిధి నుంచి రూ.90 వేలు, ప్రభుత్వం నుంచి రూ.2.10 లక్షలు కేటాయించాం.

- తిర్యాణి, ఆంధ్రజ్యోతి

లారీ బోల్తా



బోల్తా పడిన కంకర లారీ

చింతలమానేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని ముత్యంపేట నుంచి మహారాష్ట్రకు కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ మంగళవారం తెల్లవారు జామున చింతలమానేపల్లి- బాలాజీ అనుకోడ గ్రామాల మధ్యలో అదుపు తప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న కంకర పూర్తిగా రోడ్డుపై పడిపోయింది. కాగా డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రతి రోజూ అధిక లోడ్‌తోపాటు మద్యం మత్తులో వాహనాలను నడుపుతుండడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

రేపు పండ్ల తోటల వేలం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం జంబుగ లోపండ్ల తోటల వేలం కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంబుగ తోటలో బంగినపల్లి, దశేరి, తోతపురి, హిమాయత్, లాంగ్ర వంటి మామిడి హైబ్రిడ్ రకాలున్నట్లు తెలిపారు.

యువతకు ఉచిత శిక్షణ

రెబ్బెన, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు కిమ్స్ ఫౌండేషన్ అండర్ రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలోఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నారని బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు సికింద్రాబాద్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం 8019816641, 7287819562 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లబ్ధిదారులకు సన్నబియ్యం అందజేస్తున్నాం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేస్తున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రలోని కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్‌లతో కలిసి అన్ని మండలాల ప్రత్యేకాధి కారులు, తహసీల్దార్‌లు, మండల పరిషత్ అధికారులతో సన్న బియ్యం పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతీ లబ్ధిదారుడికి సన్న బియ్యం పంపిణీ చేసే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని చౌక ధరల దుకాణాల వద్ద పండుట వాతావరణంలో సన్న బియ్యం లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ప్రజాప్రతినిదులైన పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులతో పంపిణీ కార్యక్రమం ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. పంపిణీ చేసే సమయంలో గుంపుగా కాకుండా క్రమ పద్ధతిలో చేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు కార్యదర్శులను తగు చర్యల నిమిత్తం నియమించాలని, ప్రతి చౌకధరల దుకాణం వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా చౌక ధరల దుకాణాలో నిలువను దృష్టిలో ఉంచుకొని పంపిణీ ప్రక్రియ సమన్వయంతో చేయాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా, లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడన్ని నిరసిస్తూ కాగజ్‌నగర్‌లో మంగళశారం ఆ సంఘం నాయకులు ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనివారపు రజనీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమ కేసులను నమోదు చేయడం సరికాదన్నారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర స్థాయిలో పోరాటాలు చేస్తామన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, జిల్లా అధ్యక్ష, కార్యర్శులు సాయికుమార్, సాయికృష్ణ, భీమేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని సీపీఎం నాయకులు అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను మంగళవారం జిల్లా కేంద్రంలో దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు ట్లాడుతూ గత కొన్ని రోజులుగా హెచ్‌సీయూలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వేలం వేసి అమ్మే ఆలోచనలో ఉందన్నారు. యూని వర్సిటీ విద్యార్థులు ఆ భూమిని కాపాడు కోవాలని కోరారు. అక్కడ ఉన్న ప్రకృతిని రక్షించుకోవాలని, పక్షులు, జంతువులకు రక్షణ కల్పించాలని నిరసన కార్యక్రమం చేపడితే ప్రభుత్వం పోలీసు బలగాలతో అణిచి వేయాలని చూపడడం సరికాదని చెప్పారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదని, ఇలాంటి విధానాలను తాము ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో దినకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే 6 గనిపై చండీ హోమం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 6 గనిపై మంగళవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం మహా గణపతి, అగ్ని ప్రతిష్టాపన, లక్ష్మీ గణపతి హోమం, హారతి, మంత్రపుష్పం, చతు ర్వేద సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

మార్చిలో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో మార్చి నెలలో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెలలో భూగర్భ గనులు 95 శాతం, ఉపరితల గనులు 163 శాతం మొత్తంగా 147శాతం బొగ్గును వెలికితీశామని పేర్కొన్నారు. ఆర్‌కే న్యూటెక్ గని 115 శాతం ఆర్‌కే 6 గని 106 శాతం, ఆర్‌కే 7 గరి 102 శాతంగా ఉందన్నారు. అలాగే శ్రీరాంపూర్ ఓసీపీ 168 శాతం, ఇందారం ఓసీపీ 152 శాతం సాధించినట్లు చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12 నెలలకు గాను 92శాతం ఉత్పత్తి సాధించామన్నారు. మార్చి 28న 20 రేకులు, 31న రేకుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో శ్రీరాంపూర్ ఏరియాకు 65 లక్షల 16 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించినట్లు వెల్లడించారు. ఇది గతం కంటే 2 లక్షల 4 వేల టన్నులు ఎక్కువ అన్నారు. 2024-25లో 3,784 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించామని, తక్కువ మస్టర్లు ఉన్న 278 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి విధులకు రెగ్యులర్‌గా హాజరు కావాలని సూచించినట్లు వివరించారు. ఈ సమావేశం లో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

ఫైనాన్స్ విభాగంలో లక్ష్మీపూజ

జీఎం కార్యాలయ ఆవరణలోని ఫైనాన్స్ విభాగంలో జీఎం ఎం శ్రీనివాస్ మంగళవారం లక్ష్మీపూజ చేశారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం రోజున లక్ష్మీపూజ చేయడం ఆనవాయితీగా వస్తోందని, శ్రీరాంపూర్ ఏరియా ఆర్థికంగా ముందుకు దూసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీఎం(క్వాలిటీ) సుసంతా సాహు, ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, డీజీఎం (పర్సనల్) అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీలో చోటు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ జాతీయ రక్షణ సమన్వయ కమిటీలో బీఎంఎస్‌కు చెందిన పలువురికి చోటు లభించింది. ఈ మేరకు ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుజీత్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్ల పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ కమిటీ పనిచేస్తుందని ఆయన అన్నారు. సంస్థాగత ఇంటర్నల్ ఆడిటర్‌గా మంద రమాకాంత్, అధికార ప్రతినిధిగా యాదగిరి సత్తయ్య, రక్షణ కమిటీ సభ్యుడిగా నాతాడి శ్రీధర్ రెడ్డి, న్యాయ విభాగం కమిటీ సభ్యుడిగా పులి రాజారెడ్డి. మాధవనాయక్, ఫార్మసీ విభాగం సభ్యుడిగా పి. మాధవ నాయక్, పెన్షనర్స్ విభాగం సభ్యుడిగా రమాకాంత్‌లను నియమించారు.

పదోన్నతి పొందిన ఏసీఎంవోకు సన్మానం



పదోన్నతి పొందిన డాక్టర్ కిరణ్‌రాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మందమర్రిటౌన్/శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో ఏసీఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌కు పదోన్నతి లభించడంతో కార్మిక సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు మంగళవారం గోదావరిఖని ఆసుపత్రికి వెళ్లి సన్మానించారు. బెల్లంపల్లి రీజియన్‌లోని రామకృష్ణపూర్, బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రుల్లో వైద్యునిగా పనిచేశారు. కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌రాజ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల, వారి కుటుంబీల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. పదోన్నతితో తనపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమానికి, ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తుందన్నారు. యాజమాన్యం సూచన మేరకు సేవలు అందిస్తామని తెలిపారు.

జనరల్ మజ్దూర్లకు ప్లేడేలు పెంచాలి



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఇందారం ఓసీపీ జనరల్ మజ్దూర్లు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌కు శ్రీరాం పూర్ యూనియన్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ షిఫ్‌లో పనిచేస్తున్న 65 మంది జనరల్ మజ్దూర్లకు 8 ప్లేడేలు మాత్రమే ఇవ్వడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. గతంలో 18 మంది జనరల్ మజ్దూర్లు ఉన్నప్పుడు 11 ప్లేడేలు ఇచ్చేవారని గుర్తు చేశారు. సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ప్లేడేలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య, సహాయ కార్యదర్శి బాలయ్య, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి దుర్గం లక్ష్మణ్, ఆర్‌జీ-1 బ్రాంచ్ కార్యదర్శి పల్లె క్రాంతి కుమార్, పిట్ కార్యదర్శి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత 65లక్షల 16 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గనులలో కావాల్సిన యంత్రాలు, యంత్ర సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఓసీపీల పీవోలు శ్రీనివాస్, ఏవీరెడ్డి, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, డిప్యూటీ సీఎంఓ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ కార్మికులకు వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఓసీపీలలో పనిచేసే కార్మికులకు వేసవికాలం దృష్ట్యా వసతులు కల్పించాలని హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరారు. రెస్ట్ హాల్ నిర్మించాలని, తాగునీటి సౌకర్యం అందించాలని, డంపర్లలో ఏసీలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలిన స్పెషల్ ఇన్సెంటివ్ అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్లెక్సీ తొలగింపుపై నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌రోడ్డు, పలు చౌరస్తాల వద్ద స్థానిక కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఎండీ గౌస్ ఏర్పాటు చేసిన ప్రేంసాగర్‌రావు ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించడంతో వివాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎండీ గౌడ్ రంజాన్ పండుగ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుపై అభిమానంతో పట్టణంలో పలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే మున్సిపల్ సిబ్బంది ఏవిధంగా తొలగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ సమాధానం చెప్పాలని అంబేద్కర్ చౌరస్తా రోడ్డు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఎస్ఐ అక్కడికి చేరుకొని మైనార్టీ నాయకులను సముదాయించారు. ఫ్లెక్సీలను యథావిధిగా ఏర్పాటు చేయడంతో వివాదం సద్దు మనిగింది.

మజ్జిగ పంపిణీ

తాండూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గుండా బాలకృష్ణ సోదరుడు గుండా సంతోష్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఐబీ కేంద్రంలోని అండర్ బ్రిడ్జి వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. గుండా సాయితేజ, గుండా నరేష్, బీజేపీ నాయకులు సుధీర్ గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ హోంగార్డు

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం వేంకటేశ్వర చౌరస్తా మెయిన్‌రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను ట్రాఫిక్ హోంగార్డు పూడ్చి శభాష్ అనిపించుకున్నారు. మెయిన్‌రోడ్డుపై ఇటీవల గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గమనించిన మంచిర్యాల ట్రాఫిక్ హోంగార్డు వెంకటేశ్ ప్రమాదాలు నివారించేందుకు గుంతను పూడ్చారు. పలువురు వెంకటేశ్‌కు అభినందనలు తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు శిక్ష

చెన్నూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) :చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ మంగళవారం మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి తీర్పునిచ్చారు. కిష్టంపేట గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్‌కు బుద్దారం గ్రామానికి చెందిన ఆలం సత్తయ్య చెక్కు ఇచ్చాడు. చెక్కు బౌన్స్ కావడం, నేరం రుజువు కావడంతో ముద్దాయి సత్తయ్యకు రెండేళ్ల జైలు శిక్ష, రూ. 10 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

వసతులు లేని.. వార సంత



భీమినిలో రోడ్డుపైన వారసంత

రోడ్డుపైనే విక్రయాలు

ఇబ్బందులు పడుతున్న వాహన దారులు

పట్టించుకోని అధికారులు

భీమిని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే వారసంతలో వసతులు కరువయ్యాయి. సంతను నిర్వహించేందుకు వనరులు ఉన్నా వసతులు మాత్రం లేవు. దీంతో ఆర్‌అండ్‌బీ రహదారిపైనే సంతను నిర్వహించడంతో వాహనదారులు ఇటు క్రయ విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలకు ఎండి వానకు తడుస్తూ అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం సంతలో తాగు నీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

ఈ సంత ద్వారా గ్రామ పంచాయతీకి ఏడాదికి లక్షల్లో ఆదాయం వస్తుంది. కానీ సంతలో ఎలాంటి వసతులు కల్పించకపోవడం గమనార్హం. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల మండల, గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి సరకులు కొనుగోలు చేస్తుంటారు. చుట్ట పక్కల గ్రామాల, మండలాల చిన్న దుకాణ దారులు ఇక్కడి సంతలో రోడ్డు పైనే దుకాణాలు ఏర్పాటు చేసి సరకులు అమ్ముతూ ఉంటారు. పెద్దపేట, చెన్నాపూర్, భీమిని, మామిడిపల్లి తదితర గ్రామాల ప్రజలు తాజా కూరగాయలను ఇతర వస్తువులను సంతలో అమ్ముకుంటారు. ప్రతీ గురువారం జరిగే ఈ సంతలో సుమారు 2 నుంచి మూడు లక్షల వరకు వ్యాపారం సాగుతోంది. ప్రత్యేక స్థలం కేటాయించి వ్యాపారులకు ప్రత్యేక షెడ్లు నిర్మించి మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

సంతలో ఇబ్బందులెన్నో..

మారుమూల గ్రామాల్లో నిర్వహించే వార సంతలకు పల్లెటూరి సూపర్ మార్కెట్లుగా పిలుస్తారు. గ్రామాల్లో నిర్వహించే వార సంతల్లో కూరగాయలు, బట్టలు, చిన్న పిల్లలు ఆడే వస్తువులు, వివాహనికి కావల్సిన సామగ్రితో పాటూ అన్ని రకాల వస్తులవులు ఒకే చోట లభ్యమవుతాయి. వారసంతలతో గ్రామ పంచాయతీకి కూడా ఆదాయం సమకూరుతుంది. ప్రతి గురువారం సంతలో సుమారు 60 నుంచి 70 మంది వ్యాపారులు వివిధ వస్తువులు అమ్మకాలు చేస్తుంటారు. ఒక్కో వ్యాపారి వద్ద బుట్టకు రూ. 50 చొప్పున వసూలు చేస్తుంటారు. అయితే ఆదాయం ఉన్నా సౌకర్యాలు మాత్రం అధికారులు కల్పించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. కనీసం మూత్రశాలలు కూడా లేకపోవడంతో మహిళా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి. ప్రతీ వారం తమ వద్ద డబ్బులు తీసుకుంటున్నా వసతులు మాత్రం కల్పించడం లేదన్నారు.

రాకపోకలు కష్టతరం..

సంత మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉండటంతో అటు ప్రజలు ఇటు వ్యాపారులు, విద్యార్థులు అసౌకర్యానికి గుర వుతున్నారు. సాయంత్రం సమయాల్లో జనంతో రద్దీగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు సైతం రాకపోకలు సాగించడం కష్టతరంగా మారుతుంది. కొన్ని సందార్భాల్లో రద్దీ అధికంగా ఉండ టంతో ఆర్టీసీ బస్సులు, ఇతర పెద్ద వాహనాలు సైతం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. చిరు వ్యాపారులు ప్రతీ గురువారం వచ్చి చిన్నచిన్న టెంట్లు వేసుకోని వస్తువులను విక్రయాలు జరుపుతుంటారు. ఇక వర్షాకాలంలో వీరి బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి అక్కడే షెడ్లు ని ర్మించాలని కోరుతున్నారు.



రాకపోకలకు ఇబ్బందులు

: జంగెపల్లి తిరుపతి, భీమిని

వార సంత రోడ్డుపైనే నిర్వహిస్తుండటంతో ప్రయాణికులు, వాహన దారుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. నడీ రోడ్డుపై వాహనాలు ఆపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తూ వ్యాపారులకు షెడ్లు, గద్దెలు నిర్మించాలి.



సంతకు స్థలం కేటాయించాలి

: పోతురాజుల శంకర్, లక్ష్మీపూర్

మండల కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలి. సంతలో తాగు నీరు, మహిళలకు మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌక ర్యం లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే షాపులు ఏర్పాటు చేయడంతో వివిధ పనులపై వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆగని నకిలీ పత్తి విత్తనాల దందా...!

(5వ పేజీ తరువాయి)

ప్రతి ఏటా సగటున లక్షా యాభై వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. పంట చేతికి వచ్చే సరికి రైతులు మూడు సార్లు మందు వినియోగిస్తారు. దీంతో విత్తనాలకే రూ. 3వేల పై చిలుకు వెచ్చించాల్సి రావడంతో రైతులు చవకగా లభించే బీటీ, గ్లైఫొసెట్ మందుల వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

అక్రమ రవాణాపై టాస్క్'ఫోర్స్'....

నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రామగుండం కమిషనరేట్‌లోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులకు ప్పాలడుతున్నారు. కల్తీ, నకిలీ విత్తనాల రూపుమాపి, రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయా లకు అనుగుణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్థానిక పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి కృషి చేస్తున్నారు. గతనెల 26న మందమర్రిలో రూ. 7,87,500 విలువగల 315 కిలోల పత్తి విత్తనాలు పట్టుబడటమే దీనికి నిదర్శనం.

కఠిన చర్యలు తీసుకుంటాం...

మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్



ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు, గ్లైసిల్ గడ్డి మందు విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ సూచనలు, నిబంధనలకు అనుగుణంగా డీలర్లు విక్రయాలు సాగించాలి. నిశేధిత విత్తనాలు వాడే రైతులకూ తీరని నష్టం వాటిల్లుతుంది. నకిలీ విత్తనాలు విక్రయించే ముఠా సభ్యుల సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు తెలియజేయాలి. జిల్లాలోకి నకిలీ విత్తనాల ముఠా ప్రవేశించే అవకాశాలున్న అన్ని బార్డర్ల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశాం. నకిలీ విత్తనాల సరఫరాను ప్రోత్సహించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించ బోము. ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ సహకారంతో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

సన్న బియ్యం సంబురం..



జైపూర్‌లోని రేషన్ షాపును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

రేషన్ షాపుల వద్ద జనాలు సందడి

నస్పూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం నుంచి మొదలైంది. ఇదివరకు రేషన్ బియ్యం అంటే దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించడంతో రేషన్ షాపుల వద్ద జనాల సందడి నెలకొంది. నస్పూర్ పట్ట ణంలో 17 షాపుల ద్వారా లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేపట్టింది. ఉగాది పర్వదినం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హుజూర్‌నగర్‌లో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో రేషన్ షాపుల వద్ద నాయకులు, డీలర్లు సన్న బియ్యం పంపిణీ సంబరాలను చేశారు.

మందమర్రిటౌన్ : పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ మాట్లాడారు. పట్టణంలో ని రేషన్‌కార్డు లబ్దిదారులందరికీ సన్నబియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు సుదర్శన్, గణేష్, రజిని, లక్ష్మణ్, కిరణ్ పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మంగళవారం మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. తాండూర్‌లో ఎఫ్‌సీఐ బోర్డు మెంబర్ పులగం తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాజీ జడ్పీటీసీ బానయ్యలు ప్రారంభించారు.

జైపూర్ : నిరుపేద కడుపు నింపడానికే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రేషన్ షాపుల్లో కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సన్నబియ్యం ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలని సూచించారు.

దండేపల్లి: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శమని రాజీవ్‌గాంధీ పంచాయితీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డంత్రిమూర్తి, లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలోని మంగళ వారం రేషన్ దుకాణాలలో లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెన్నూరు : పట్టణంలోని రేషన్ షాపుల్లో మంగళవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పట్టణాధ్యక్షుడు సూర్యనారాయణ, డీసీసీ సెక్రటరీ కలీల్, నాయకులు నాగరాజు, మహేష్, సయ్యద్‌సాహిర్ పాల్గొన్నారు.

జన్నారం : మండలంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. పొనకల్ గ్రామంలోని రేషన్ దుకాణంలో లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలను అమలు చేస్తుందన్నారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్‌షరీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీ, నాయకులు పసివుల్లా, ఇందయ్య లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.









నస్పూర్, దండేపల్లిలో సన్నం బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు.. జన్నారం మండలం పొనకల్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్..మందమర్రిలో కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రాజుగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని జైతుగూడలో మృతి చెందిన బొయిడి లక్ష్మి కుటుంబానికి మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్ మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలి కుమారుడు కాంగ్రెస్ క్రియాశీల కాంగ్రెస్ కార్యకర్త బోయిడి కన్న య్యకు రూ, 5వేల ఆర్థిక సాయం అంద జేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి రూ4వేల ఆర్థిక సాయంను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జంగు, మాజీ సర్పంచు కాంతరావు, నాయకులు చంద్రయ్య, రవీందర్, రాజన్న, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యలోనే నిలిచిన సన్నబియ్యం పంపిణీ

ఆగ్రహం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

కాసిపేట,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ సగంలోనే నిలిచిపోయింది. దీంతో రేషన్ షాపుల ముందు క్యూ కట్టిన లబ్ధిదారులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. 19 రేషన్ షాపుల ముందు టెంట్లు వేసి స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. కానీ ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి అందుబాటులో లేరని పంపిణీని అర్థాంతరంగా నిలిపివేశారు. సుదూర ప్రాంతాల నుంచి రేషన్ షాపులకు వచ్చిన లబ్దిదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో లబ్ధిదారులు డీలర్లతో వాదనకు దిగారు.



కాసిపేటలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

...సరఫరా చేసినట్లు తెలుస్తుంది.

ఎమ్మెల్యే వస్తేనే బియ్యం పంపిణీ చేస్తారా...?

బెల్లంపల్లి, :ఎమ్మెల్యే గడ్డం వినోద్ వచ్చి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభిస్తేనే పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తారా అని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోడి రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని చెప్పినప్పటికీ బెల్లంపల్లిలో మాత్రం ఎమ్మెల్యే వినోద్ ఉంటేనే సన్నబియ్యం పంపిణీ అవుతాయా అని ప్రశ్నించారు. రేషన్ దుకాణ దారులకు, ప్రభుత్వ అధికారులకు రేషన్ డీలర్లకు ఫోన్‌లు చేసి రేషన్ దుకాణాలను మూయించారని ఎమ్మెల్యే వచ్చాకనే సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలివ్వడం ఎంత వరకు సరైందన్నారు.

●ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ బెల్లంపల్లి పట్టణంలో మంగళవారం రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయలేదు. పట్టణంలో మొత్తం 31 రేషన్ షాపులు ఉండగా దాదాపు 15 రేషన్ షాపులకే సంబంధిత శాఖ అధికారులు సన్నబియ్యం సరఫరా చేసినట్లు తెలుస్తుంది.

వేమనపల్లి : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం సన్నబియ్యం పథకం ప్రారంభించినప్పటికీ వేమనపల్లి మండలంలో ఈ పథకం మంగళ వారం ప్రారంభం కాలేదు. మండలంలో మొత్తం 12 రేషన్ షాపులు ఉన్నాయి. వీటికి సరిపడ బియ్యం రాలేదు. ఈ విషయంపై తహసీల్దార్ రమేష్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా బుధవారం నుంచి మండలంలోని అన్ని రేషన్‌షాపుల్లో ప్రారంభమవుతుందని చెప్పారు.

ఐక్య ఉద్యమాలతోనే హక్కులు సాధ్యం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు

కాసిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల ఐక్య ఉద్యమాలతోనే హక్కులు సాధ్యమవుతాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం, బిల్డర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ మండల మహాసభలకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం కార్మికులందరు ఐక్యంగా ఉండి పోరాటాలు చేసినప్పుడు హక్కులు సాధ్యమవుతాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు కలిగి ఉండాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఇన్‌చార్జీ దాగం మల్లేష్ మాట్లాడుతూ ఈ నెల 13న మందమర్రిలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. అనంతరం భవన నిర్మాణ సంఘం మండల కమిటీని ప్రకటించారు. మండల గౌరవాధ్యక్షుడిగా జాడి పోశం, అధ్యక్షులుగా బండారి సత్తయ్య, ఉపాధ్యక్షులుగా ఉప్పులేటి మధునయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగాదరి రాజయ్య, కోశాధికారిగా నల్ల శ్రీనివాస్, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని..

ఖాళీ బిందెలతో నిరసన



వడాల గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

భీమిని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడాల గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళ వారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతిని ధులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని, మిషన్ భగీరథ ట్యాంక్‌కు విద్యుత్ కనెక్షన్ లేదని, నీరు ట్యాంకు లోనికి ఎక్కడం లేదని వివిధ కారణాల సాకులతో కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. నీటి కోసం చేతిపంపుల వద్దకు వెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ ట్యాంకుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తమ కాలనీకి నీరు సరఫరా చేయాలని వారు కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

గూడెంలో హనుమాన్ భక్తుల సందడి



ఆలయంలో దీక్ష తీసుకున్న అంజన్న స్వాములు

దండేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ భక్తుల సందడి నెలకొంది. ఈనెల10న మహావీర్ జయంతి సందర్భంగా 1105మందిపైగా భక్తులు ఆలయానికి తరలివచ్చి హనుమాన్ దీక్ష తీసుకున్నారు. దీక్షపరులకు మాలధారణ నియమాలు పలు సూచనలు అర్చకులు వివరించారు. అనంతరం భక్తులు హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా పఠనం చేసి సత్యదేవుడిని దర్శించుకున్నారు. అన్ని ఏర్పాటు చేసిన్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

వేధింపులు భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

లక్షెట్టిపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలంలోని పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గడికొప్పుల రామయ్య(65) వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సతీష్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం రామయ్యతో కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన వరుసకు అల్లుడు అయిన కొట్టె సత్తయ్య అనే నింది తుడు గొడవ పడుతున్నాడు. గ్రామంలో రామయ్య ఎక్కడ కనిపించినా నోటికి వచ్చినట్లు తిడుతూ వేధింపులకు పాల్పడేవాడు. వేధింపులు భరించలేక ఇంట్లో మంగళవారం ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామయ్య కొడుకు మహేందర్ ఫిర్యాదు మేరకు సత్తయ్యపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

కమిషనరేట్‌లో 9మంది సిబ్బంది బదిలీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 9మంది సిబ్బందిని బదిలీ చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. అంతర్గాం హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రావు పొత్కపల్లికి, టుటౌన్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కాల్వ శ్రీరాంపూర్‌కు, గోదావరిఖని వన్‌టౌన్ కానిస్టేబుళ్ల తీట్ల శ్రీనివాస్ జూలపల్లికి, రవిని పొత్కపల్లికి బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లా దేవాపూర్ హెడ్ కానిస్టేబుల్ పూర్ణ చందర్‌ను చెన్నూరుకు, దండేపల్లి కానిస్టేబుల్ తిరుపతిని కన్నేపల్లికి బదిలీ చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ కానిస్టేబుల్ మల్లేష్‌ను జన్నారానికి, చెన్నూరు టౌన్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను దండేపల్లికి బదిలీ చేశారు. మందమర్రి టౌన్ కానిస్టేబుల్ రవికుమార్‌ను కోటపల్లికి బదిలీ చేశారు.

పవర్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించిన జీఎం

బెల్లంపల్లి రూరల్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో సింగరేణి యాజమాన్యం చేపడుతున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మిస్తున్న స్థలాన్ని మందమర్రి సింగరేణి జీఎం దేవేందర్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ మంగళవారం పరిశీలించారు. కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుశ్నపల్లి రాజలింగు తనకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో సింగరేణి యాజమాన్యం సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపడుతుందని మంచిర్యాలలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన అధికారులు స్థలాన్ని పరిశీలించారు. తనకు న్యాయం చేయాలని అధికారులను రాజలింగు వేడుకున్నారు. దీంతో అధికారులు విచారణ చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి బాధితుడికి హామీ ఇచ్చారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

తాండూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మహిళ పోగొట్టుకున్న ఫోన్‌ను మంగళవారం ఆమెకు అందజేసినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాలకు చెందిన శ్రీనిధి అనే మహిళ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకుంది. వెంటనే అక్కడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తాండూర్ మండలంలోని తంగళ్లపల్లిలోని వ్యక్తి వద్ద ఫోన్ దొరికిందని తెలిపారు. దీంతో తాండూర్‌లోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఫోన్‌ను శ్రీనిధికి అందజేసినట్లు తెలిపారు.



చలి వేంద్రం ప్రారంభం

సిర్పూర్(యు) ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం ఆత్రం మాన్వీత శ్రీ ఫౌండేషన్ అధ్వర్యంలో జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్ తదితరులు చలి వేంద్రాని ప్రారంభించారు. విశ్వనాథ్‌రావ్ మాట్లాడుతు వేసవిలో ప్ర జలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఆత్రం మాన్వీత శ్రీ ఫౌండేషన్ వారు చలి వేంద్రం ప్రారంభించడం అభి నందనీయ మని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఆత్రం సునీల్‌కుమార్, నాయకులు ఆత్రం ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండం నవేగాం బస్టాప్ వద్ద మంగళవారం చలి వేంద్రాన్ని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు హనుమంతరావు ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులకు మంచినీటి కొరత ఉండకూడదనే చలి వేంద్రం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

అధికారుల తీరును నిరసిస్తూ వ్యాపారుల ర్యాలీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో తైబజారు వేలం నిలిపివేసిన కూడా వసూళ్లు చేస్తున్నారని, అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం పలువురురు వ్యాపారులు ర్యాలీ నిర్వహించారు. అధికారులు దీనిపై పునరాలోచించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అక్కడికి చేరుకుని సమస్యను అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో నేడు పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించాలి

రెబ్బెన, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో బుధవారం పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించాలని గౌడ జన హక్కుల పోరా ట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి అంజనేయులుగౌడ్, జిల్లా అధ్యక్షుడు కోండ్ర మనోహర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసిఫాబాద్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించనున్నామని తెలిపారు. పాపన్న గౌడ్ చరిత్ర ఈ తరం యువతకు తెలియజేసేలా ఆయా సంఘాల నాయకులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్పొరేట్ వల

- ఇంటర్ ప్రవేశాలకు
- తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్
- ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల పోటీ
- విద్యార్థుల ఇళ్లకు వెళుతున్న పీఆర్వోలు



ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలే పూర్తి కాలేదు. ఫలితాలు రాక ముందే విద్యార్థులను ఇంటర్‌లో అడ్మిషన్లకు కార్పొరేట్ కళాశాలలు రంగంలోకి దిగాయి. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. కానీ వచ్చే విద్యా సంవత్సరం కోసం ఇంటర్‌లో ప్రవేశాలకు ఇప్పటికే మూ డు నెలలుగా ఆయా కళాశాలల ప్రతినిధులు రంగంలోకి దిగారు. ఈ మేరకు ఆయా కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించు కున్నాయి. తమ పిల్లల జీవితాలను ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకు అప్పు చేసైనా సరే మంచి విద్య అందించాలని చూస్తారు. దీనిని ఆసరాగా చేసుకున్న కార్పొరేట్ కళాశాలలు ఫీజులో రాయితీ ఇస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం వేస్తున్నారు. కాగా మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు కొనసాగు తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6,560 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

● పరీక్షలు ప్రారంభం కాకముందే..

పరీక్షలు ప్రారంభం కాకముందే జిల్లాలో పదో తరగతి విద్యార్థుల అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు, కన్సల్టెన్సీల సభ్యులు ప్రైవేట్ కళాశాలల పీఆర్వోలు సేకరించారు. గత నెల డిసెంబరు నుంచే అడ్మిషన్ల ప్రచారాన్ని పకడ్బందీగా చేపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు నిత్యం ఫోన్లు చేస్తున్నారు. అవసరమైతే పాఠశాలల యాజమాన్యం నుంచి ఫోన్ చేయించి మాట్లాడిస్తున్నారు. ఫలితాలతో సంబంధం లేకుండా తాము కళాశాలలో చేర్పించుకుంటున్నామని ఒక వేళ పాస్ కాకపోతే డబ్బు తిరిగి ఇస్తామని చెబుతు న్నారు. ముందుగా సీటు రిజర్వ్ చేసుకోకపోతే తర్వాత కోరుకున్న బ్రాంచిలో సీటు దొరకదని చెబుతున్నారు.

● ముందుగా అడ్మిషన్ తీసుకుంటే

ముందుగా అడ్మిషన్ తీసుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఏ జెంట్లు, పీఆర్వోలు చెబుతున్నారు. కోరిన బ్రాం చిలో సీటు ఇప్పి స్తామని హామీ ఇస్తున్నారు. పదో తరగతి ఫలితాలు రాకముందే అడ్మిషన్ తీసుకుంటే ఫీజు తక్కువగా ఉంటుందని, తర్వాత పెరుగుతాయని చెబుతు న్నారు. ఫలితాలు వచ్చాక ఇబ్బందులు పడుతామనే భావనతో విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో గత డిసెంబరులోనే ప్రభుత్వ/ప్రై వేటు పాఠశాల ల్లోని విద్యార్థుల వివరాలను పీఆర్వోలు తీసుకుని వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ముందుగానే 5వేల నుంచి రూ. 10వేల వరకు అడ్వాన్స్‌గా ఫీజు కట్టించుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని అడ్మిషన్లు తీసుకుంటున్నారు. కొన్ని సార్లు హైదరాబాద్ లాంటి చోట కార్పొరేట్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు అక్కడ వసతి, భోజనం సరిగా లేక పోవడంతో తిరిగి వచ్చిన సందర్భాలు సైతం ఉన్నాయి.

అడ్మిషన్లకు అనుమతి లేదు..

- కళ్యాణి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి



ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు సంబందించి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ఆదేశాల మేరకు ఆ డ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రైవేటు కళాశా లల్లో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు తీసుకుంటే శాఖపరమైన చర్యలు ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలి.

శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం నాయకులు

సిర్పూర్(టి), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నిర్వహించే శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలి అంబేద్కర్ సంఘం నాయకులు కోరారు. అంబేద్కర్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. బిహార్ రాష్ట్రంలోని బుద్ధ గయనగరంలో సామ్రాట్ అశోకుడి ద్వారా నిర్మించడబడిన మహా బుద్ధగయా విహార్‌ను బౌద్ధులకుకు అప్పగించాలని ఈ నెల 5న నిర్వహించనున్నట్లు శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 4న మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, విక్రం, తిరుపతి, రమేశ్, దేవిదాస్, నాందేవ్, జనార్దన్, ప్రభాకర్, హీరామన్, విఠల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



గుండిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోపే పేదలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గుండి, చోర్‌పల్లి, గోవింద్‌పూర్ గ్రామ పంచాయతీల్లో మంగళవారం జైబాపు, జైభీం, జైసంవిదాన్ అభియాన్ యాత్రను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రారంభించారు. చోర్‌పల్లి గ్రామంలో ప్రారంభమైన పాదయాత్ర గుండి, గోవింద్‌పూర్ గ్రామ పంచా యతీల వరకు కొనసాగింది. ఈ యాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, నాయకులు చిట్ల నారాయణ, సెండె దత్తు, అసద్, సలీం, డాక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షలు స్వీకరణ



స్వాములకు మాలధారణ చేస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దవాగు తీరంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం మంగళవారం ఈనెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు ఏకాదశ దీక్షలను స్వీకరించారు. ఆలయ అ ర్చకుడు ఒజ్జల శిరిష్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస్‌శర్మ, శేఖర్‌శర్మ, మహేష్‌శర్మలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీక్షా పరులకు మాలధారణ చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం కాషాయమయంగా మారింది. జైశ్రీరాం, జై హనుమాన్ నామస్మరణతో మారుమోగింది. దీక్ష కాలంలో స్వాములు పాటించాల్సిన నియమ నిబంధనలను భక్తులకు ఆలయ అర్చకుడు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండా వెంకన్న, వెంకటేశ్వర్లు, వివేక్, ఏకిరాల శ్రీనివాస్, లక్ష్మణమూర్తి, ప్రకాష్‌గౌడ్, రూప్‌నార్ రమేశ్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్‌సిల్క్‌లోని రాం మందిర్ ఆలయంలో హనుమాన్ మాలధారణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వేద పండితులు శశాంక్ ద్వివేది ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, కళశపూజ, నవగ్రహ పూజ కార్యక్రమాలను నిర్వహించి హనుమాన్ విగ్రహానికి హారతి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం హనుమాన్ మాలధారణ చేసి హనుమాన్ చాలీసాను పఠించారు. కార్యక్రమంలో గురుస్వాములు, దీక్షా స్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



ఆసిఫాబాద్‌లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సన్న బియ్యం పంపిణీ ఆయా రేషన్ దుకాణాల ద్వారా మంగళవారం ప్రారంభిచారు. జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణాలలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేతో కలిసి సన్న బియ్యం పంపిణిని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో సాయన్న, డీటీ పోచయ్య, డీలర్ల సంఘం అధ్య క్షుడు కేశవరావు, డీలర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దండే విఠల్, ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, షబ్బీర్, శరత్ ముదిరాజ్, రేషన్ డీలర్లు ఉమేష్ బంగ్, లడ్డుబాబు, విజయ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రేషన్ దుకాణాలలో మంగళవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): ఇట్యాల, కోత్మీర్, బోర్లకుంట గ్రామాల్లోని చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీని మంగళవారం ప్రారంభించినట్లు తహసీల్దార్ కవిత తెలిపారు. సన్న బియ్యం పంపిణీ ప్రారం భం కావడంతో లబ్ధిదారులు సంతోషంతో తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీలర్లు, నాయకులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

యువతకు సాంకేతిక విద్య తప్పనిసరి



కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో యువతకు కంప్యూటర్ విద్య తప్పనిసరి అని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంతో పాటు కుంటలమానేపల్లి గ్రామాల్లో చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆ ప్రారంభించారు. స్థానికంగా యువతకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో చేతన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెనిగల రవి కంప్యూటర్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజక వర్గంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. కార్యక్ర మంలో చేతన్ ఫౌండేషన్ వలంటీర్ కృష్ణారా వు, సురేష్, మాజీ జడ్పీ చైర్మన్ కృ ష్ణారావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు సకారాం, వెంకన్న, సతీష్, నరేందర్‌గౌడ్, తిరుపతి, రామకృష్ణ, అమీరుద్దీన్, శంకర్, మహేష్, జాయ్ హుస్సేన్, అమృత తదితరులు పాల్గొన్నారు.

యోగా కేంద్రం నిరుపయోగం



వాంకిడిలో వినియోగంలోకి తీసుకురాని యోగా కేంద్రం

వాంకిడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్య శాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యోగా సాధన కేంద్రం నిరుపయోగంగా మాంది. జీవనశైలి వ్యాధుల నేపథ్యంలో సంప్రదాయ వైద్యంపై ఆదరణ పెంచడానికి ఆయుష్ ఆధ్వర్యంలో ఆరోగ్య స్వస్థత కేంద్రం పేరుతో కొన్నాళ్ల క్రితం నిర్మించారు. అందుకు రూ. 4.5 లక్షలు ఖర్చు చేశారు. ఉదయం పురుషులకు నెలకు 28 రోజులు సాయంత్రం మహిళలకు నెలలో 22 తరగతులు యోగా సాధన చేయించాలని సూచించారు. పురుష శిక్షకులకు నెలకు రూ. 8 వేలు, మహిళా శిక్షకులకు ఐదు వేల రూపాయలు పారితోషికంగా చెల్లించేందుకు నిర్ణయించారు. శిక్షకులు అందుబాటులో ఉన్నప్పటికీ యోగా చేయడానికి ఎవరు రాకపోవడంతో ఈ కేంద్రం నిరుపయోగంగా మారింది. యోగా కేంద్రం నిర్మించి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రజలకు చేరువలో 'మీ సేవ'లు

» తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లకుండానే పలు ధ్రువపత్రాలు జారీ

వాంకిడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మీ సేవ కేంద్రాల ద్వారా కొత్తగా తొమ్మిది రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు జాప్యం లేకుండా నిర్దిష్టమైన పద్ధతిలో అందించాలన్న ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం సులభంగా, వేగంగా నినాదంతో 2011లో మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దశల వారీగా నూతన సేవలను అందుబాటులోకి తెస్తూ రెవెన్యూ, రవాణా, పోలీస్, జీహె చ్‌ఎంసీ, మున్సిపల్, విద్యుత్తు, ఎండోమెంట్, వ్యవసాయ, రిజిస్ట్రేషన్, పౌర సరఫరా, విద్యాశాఖకు చెందిన సుమారు 300 రకాల పౌర సేవలు అందిస్తున్నారు.

మరో తొమ్మిది రకాలు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మరో తొమ్మిది రకాల సేవలను మీసేవ జాబితాలో చేర్చింది. రెవెన్యూ పరిధిలోని సేవలతో పాటు అటవీశాఖకు సంబం ,దించిన నూతన ఐచ్ఛికాలను అందుబాటులోకి తెచ్చింది. పౌరుల పేరు మార్పిడి, తరచూ జారే చేసే ఆదాయం, కుపేల తదితర ధ్రువీకరణ పత్రాలు, స్థానికల నిర్ధారణ(లోకల్ క్యాండిడేట్), స్టడీ గ్యాప్ సర్టిఫికెట్ అందజేయాలని నిర్ణయిం చింది. మైనారిటీ ధ్రువీకరణ, క్రీమీలేయర్, నాన్ క్రీమీలేయర్, మార్కెట్ విలువ, ఖాస్రా, పహాణీల వంటి పాత ధ్రువీకరణ పత్రాలు, ఆర్వోఆర్-1(బి) సర్టిఫైడ్ కాపీలు అందించాలని అధికారులు నిర్ణయించారు. వయో వృద్ధుల నిర్వహణ కేసులు, పర్యవేక్షణ వ్యవస్థ వంటి సేవలు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నాయి. వన్యప్రాణుల దాడిలో మరణించిన వ్యక్తులు, జంతువులకు సంబంధించి అందించే నష్టపరిహారం, కలప(టింబర్) డిపోలు, సామిల్ అనుమతులు, రెన్యూవల్, నిర్వహణ వంటి అటవీశాఖ సేవలు నూతనంగా మీసేవ కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చాయి. అధికారులు మీసేవ కేంద్రాల నిర్వహకులకు, ఆపరేటర్లకు నూతన సర్వీసు లపై అవగాహన, శిక్షణ కల్పించడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందేఅవకాశాలు ఉన్నాయి.

అనాథ పిల్లలకు అండగా ఉంటాం

చింతలమానేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):జన భవిత ట్రస్ట్ అనాథ పిల్లలు రక్షణగా అండగా ఉంటుందని ఆ ట్రస్ట్ అధ్యక్షుడు సురేష్ అన్నారు. చింతలమానేపల్లి మండలంలోని రుద్రాపూర్ గ్రామానికి చెందిన ఎన్నం సోని ఇటీవల టీబీ వ్యాధి బారిన పడి మృతి చెందింది. వీరికి ఇద్దరు పిల్లలు అభి, నందిని ఉన్నారు. అమ్మమ్మ వాళ్ల ఇంట్లో ఉంటూ అభి ఎల్‌కేజీ, నందిని 6వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. తల్లిదండ్రులను కోల్పోయి ఇద్దరు పిల్లలు అనాథగా మారిన విషయాన్ని తెలుసుకున్న జన భవిత ట్రస్ట్ సభ్యులు మంగళవారం వారిని పరామర్శించారు. వారిద్దరికి విద్యాపరంగా ఉన్న చదువుల కోసం సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడుతామని తెలిపారు. కార్యక్రమంలో జన భవిత ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, విజయ్‌కుమార్, మహేందర్, సృజన, వందన పాల్గొన్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా



కాలనీలోని వాటర్ ట్యాంక్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్‌సిల్క్ కాలనీలో నాలుగు రోజులుగా తాగునీరి సరఫరా నిలిచిపోయింది. సర్‌సిల్క్‌లో ఉన్న ట్యాంకు సంబంధించిన వాల్వ్ చెడి పోవటంతో మరమ్మతుల నిమిత్తం మంచిర్యాలకు పంపించారు. తాగునీటి సరఫరా కాక పోవటంతో ఎస్పీఎం క్వార్టర్లు, మార్కెట్ నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక వైపు ఎండలు అధికంగా ఉండటం, మరో వైపు తాగునీటి సమస్య తీవ్రతరం అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంటంతో మంచినీటి కోసం వాటర్ ప్లాంటు కేంద్రాల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ఈ కాలనీలో ఉన్న బోరింగ్‌లు, నీటి బావులపైనే ఆధార పడుతున్నారు.